క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 94403 22964 నంబరుకు సంప్రదించాలని కోరారు.

సిమెంటు బెంచీల ఏర్పాటు


ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

భామిని: స్థానిక బండాలమ్మ తల్లి సన్నిధిలో మహాశివరాత్రి పర్వదినం ఆశ్రమానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎనిమిది సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. మనజనం సేవా సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రవిచంద్రస్వామి ఆధ్వర్యంలో బెంచీలు బిగించారు.

జిల్లా కేంద్రానికి ఆర్టీసీ సర్వీసులు నడపాలి

భామిని: భామిని మండలం నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఆర్టీసీ తగినన్ని సర్వీసులు నడపాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బత్తిలి సొసైటీ చైర్మన్ బోదెపు రఘుపతినాయుడు కోరారు. జిల్లా అధికారులను కలిసేందుకు పార్వతీపురం వెళ్లాలంటే ఆర్టీసీ సర్వీసులు తగినన్ని ఉండాలన్నారు. భామిని, బత్తిలి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మీదుగా పార్వతీపురం నిత్యం రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని కోరారు. చివరకు సీతంపేట మండలానికి కూడా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

నేడు దుగ్గేరులో వైద్యశిబిరం

మక్కువ: మండలంలోని దుగ్గేరు గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుగ్గేరులో వారపుసంత జరుగునుండడంతో, గిరిజనుల సౌకర్యార్థం పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రముఖ వైద్యాధికారులతో వైద్యసేవలు అందించడంతోపాటు, ఉచితంగా మందులు అందించనున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయనున్నామన్నారు.

నేడు మావుడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మక్కువ సబ్‌స్టేషన్ పరిధి మావుడి గ్రామంలో 33/11 ఎస్ఎస్, మావుడి, 11 కేవీ చింతలవలస ఫీడర్లపై ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ కె.గోపాలరావు నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 4గంటల నుంచి 10 గంటల వరకు త్రీఫేస్ సప్లై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

జెడ్పీ మాజీ చైర్మన్ వాకాడకు పరామర్శ

సీతానగరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీమాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విశాఖ ఆస్పత్రిలో నాగేశ్వరరావు వైద్యం పొందారు. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో స్వగ్రామం బూర్జకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారంతా యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకాడ నాగేశ్వరరావును పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ జిల్లా కార్యదర్శి బంకురు శంకరరావు, బి. ముకుందరావు, గాదెలవలస సర్పంచ్ బి.తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

అన్న సమారాధన


అన్నదాన కార్యక్రమంలో పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: మండలంలోని సుడిగాం గ్రామంలో గల శివాలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం భక్తులకు పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, దేవాలయానికి వచ్చిన భక్తులకు స్థానిక గ్రామస్తులతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలు పరమశివుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఒక్క క్లిక్‌తో చీడపీడలకు చెక్

- సరికొత్త యాప్ రూపొందించిన కేంద్రం
- తెగుళ్ల సమస్య ఫొటో అప్‌లోడ్ చేస్తే వెంటనే పరిష్కారం
- శాస్త్రవేత్తల సలహాలు నేరుగా రైతులకు ప్రత్యక్షం



ఎన్‌పీఎస్ఎస్ యాప్



గుమ్మలక్ష్మీపురం: చీడపీడలకు చెక్ పెట్టేందుకు వ్యవసాయ సాగు ఆరంభం నుంచి పంట చేతికి వచ్చే వరకూ రైతుల వెన్నంటి ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ఎస్ అనే యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వ్యవసాయంలో తమకు వచ్చిన చీడపీడల సమస్యల్ని ఫొటో రూపంలో లోడ్ చేసిన మరుక్షణమే పరిష్కారం లభిస్తోంది. ఫొటో లోడ్ చేయగానే శాస్త్రవేత్తలు ఫోన్‌లైన్ ద్వారా అందుబాటులోకి వచ్చి వారి సలహాలను దేశంలోని అన్ని ప్రాంతాల్లోని భాషల్లో రైతులకు అందించే ఏర్పాటును కేంద్రం చేసింది. పురుగు మందుల దుకాణ యజమానులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల కోసం రైతులు పరుగులు తీయాల్సిన పనే ఇక లేదు. ఇప్పుడు రైతుల చేతుల్లో ఉండే ఫోన్లలోనే వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిష్కారం చేస్తున్నారు. ఈ యాప్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ అభివృద్ధి చేసింది. రైతు తనకు వచ్చిన సమస్య ఫొటోను లోడ్ చేసిన వెంటనే ఆ పైరుకు ఏ వ్యాధి సోకింది.. దాని వలన ఎంత నష్టం చేకూరుతుంది.. నివారణ మార్గాలతో సహా శాస్త్రవేత్తలు చెబుతారు. ఈ యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకుంటే తన చేతిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నట్లే.

రైతు సమస్యలను తీర్చే యాప్‌లు ఇవే..

నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్), క్రాఫ్ లైఫ్ సిస్టమ్ అనే యాప్‌లను కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను సకాలంలో తెలుసుకుని నివారణా చర్యలు చేపట్టడానికి ఇవి రైతులకు ఉపయుక్తమవుతాయి. తెగుళ్లను వేగంగా గుర్తించడం, సకాలంలో నివారణా చర్యలు చేపట్టడంతో నష్టం తక్కువగా ఉంటుంది. దాదాపు 15 రకాల పంటలను ఆశించే కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతిని ఈ యాప్‌ల ద్వారా అరికట్టే అవకాశం ఉంది.

డౌన్లోడ్ చేసుకోవడం ఇలా..

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఐఓఎస్ ప్లే స్టోర్‌లో ఎన్‌పీఎస్ఎస్ అని టైప్ చేసిన వెంటనే ఈ యాప్ ప్రత్యక్షమవుతుంది. దానిని డౌన్లోడ్ చేసుకుని సులభంగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా తెగుళ్లను అరికట్టడంతో పాటు మిత్ర, శత్రు పురుగులను కూడా గుర్తించవచ్చు. రైతులు కేవలం ఫొటో తీసి అప్లోడ్ చేస్తే చాలు

సాంకేతిక మేళవింపు

కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), యంత్ర అభ్యాసం(మిషన్ లెర్నింగ్) వంటి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే ఈ యాప్లో ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావాలి. రైతు తన పొలాన్ని ఆశించిన తెగుళ్లను ఫొటో తీసి అప్లోడ్ చేయాలి. దాని నియంత్రణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తారు. ఇవన్నీ ఫరీదాబాద్ డీపీపీ క్యూస్ కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌లో నిక్షిప్తం చేయబడతాయి. తద్వారా పంటలపై ఆశిస్తున్న తెగుళ్ల సమాచారం కూడా ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ 15 ఆగస్టు 2024లో ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించారు.


మొక్కజొన్నలో ఆశించిన తెగులు

రైతులకు ఎంతో ఉపయోగం

కేంద్రానికి చెందిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌తో పాటు మన రాష్ట్రానికి చెందిన ఏపీపీఎస్ఎస్ యాప్ కూడా రైతులు చేసే వ్యవసాయ సాగుకు ఎంతగానో దోహదపడుతుంది. పంటకు సోకిన పురుగులను ఫొటో తీసి అప్లోడ్ చేస్తే వెంటనే నివారణ చర్యలు తెలియజేస్తారు. మిత్ర, శత్రు పురుగులను గుర్తించే అవకాశం రైతులకు కలుగుతుంది. పంటల సస్యరక్షణకు అన్ని విధాలా ఈ యాప్ మేలు చేసూరుస్తుంది. ఈ యాప్‌పై అన్ని మండలాల రైతులకు వ్యవసాయాధికారులు, వీఏఏల ద్వారా అవగాహన కల్పించాం.

–ఎ.నిర్మలా జ్యోతి, ఏడీఏ, కురుపాం

వామ్మో... ఎండలు


వేసవి రాక ముందే ఎండలు తీవ్రమయ్యాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే వీరఘట్టం ప్రధాన రహదారి బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జన సంచారం లేక బోసిపోయింది. ఎండలు ఒక్కసారిగా సుర్రుమనడంతో జనం కనిపించకుండా పోయారు. ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. – వీరఘట్టం

కేంద్రాలకు చేరిన పోలింగ్ సిబ్బంది


భామిని: పోలింగ్ బూత్ వద్దకు చేరుకొన్న పోలింగ్ ఇబ్బంది


వీరఘట్టం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ


సీతంపేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు తదితరులు

భామిని: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రానికి సంబంధిత ఎన్నికల సిబ్బంది బుధవారం చేరుకున్నారు. భామిని జెడ్పీహెచ్ఎస్ భవనంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 44 మంది ఉపాధ్యాయులు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. తహసీల్దార్ ఎస్.అప్పారావు, బత్తిలి ఎస్ఐ డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

వీరఘట్టం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులను బుధవారం ఆయన పరిశీలించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ అప్పలరాజు, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఎస్ఐ వై.అమ్మన్నరావు బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు, నిఘా కెమెరాలను చూశారు. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

శంభో శంకర

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- కన్నుల పండువగా మహాశివరాత్రి పర్వదినం
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతిర్లింగాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. పలుచోట్ల అన్న సమారాధన నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


పాలకొండ: వెలగవాడ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పూలతో ఏర్పాటు చేసిన శివలింగం


పాలకొండ రూరల్: తంపటాపల్లిలో భక్తులచే పూజలందుకుంటున్న ఉమా మహేశ్వర, వీరభద్రస్వామి


పాలకొండ: నక్కలపేట లోని మరకలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణ వేడుకలు


కొమరాడ: గుంప సోమేశ్వరుడు మహాలింగం


గరుగుబిల్లి: గిజబలో శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు


గరుగుబిల్లి: పెద్దూరులో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం గుమ్మలో మణికంఠేశ్వర ఆలయం వద్ద క్యూ లైన్‌లో భక్తులు


భామిని: మిన్నాజోలలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆశాజనకంగా మొక్కజొన్న


మొక్కజొన్న పంట

- ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగుబడి

బలిజిపేట: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. రబీలో దాదాపు 2వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు పంటను సిద్ధం చేసి విక్రయించారు. మంచి దిగుబడులు వస్తాయనే భావనతో రైతులు రబీసీజన్‌లో ఎక్కువగా మొక్కజొన్న పంటవైపు దృష్టిసారించారు. అందుకు వ్యవసాయశాఖ అధికారులు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అన్నదాతలు ఒక్కో ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి పండిస్తున్నారు. ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంచనా. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.2,200 నుంచి రూ.2,600వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఆదాయం కూడా బాగుంటుందని చెబుతున్నారు.


ఆరబెట్టిన జొన్న పిక్కలు

సాగు సులభతరం:

ఇతర పంటల కంటే మొక్కజొన్న సాగు సులభతరం అవడంతో పాటు ఎరువులు వినియోగం కూడా తక్కువ. పంటకాలం 120రోజులు కాగా సాగుకు మూడు నుంచి నాలుగు విడతలు నీరు సరిపోతుంది. వరి పూర్తయిన తర్వాత మాగాణి భూముల్లో రెండో పంటగా మొక్కజొన్న సాగుచేసుకుంటే సులువుగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వరికి ఎక్కువగా ఎరువులు వాడి ఉంటారు కాబట్టి అది మొక్కజొన్నకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

పంట బాగుంది

మొక్కజొన్నతో నష్టం రాదు. రైతుకు లాభం చేకూరుతుంది. వరికంటే ఇదే ఉత్తమం. ప్రాంతాన్ని బట్టి, భూసారాన్ని బట్టి మదుపులు ఉంటాయి. ఏది ఏమైనా సులువుగా చేతికి వచ్చే పంట మొక్కజొన్న.

వెంకటరమణ, రైతు, జనార్దనపురం

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలి

- నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి


జట్టు ట్రస్టు బృందంతో చర్చిస్తున్న నాబార్డు డీడీఎం దినేష్‌రెడ్డి తదితరులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలని నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు ఆయన అప్కాబ్ జనరల్ మేనేజర్లతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడుతో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల దిగుబడి పెంపునకు, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో దోహదం చేస్తుందన్నారు. బడి నుంచి పొలంబడి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సుస్థిర ఆదాయాన్ని పొందేందుకు ప్రకృతి వ్యవసాయ విధానం భవిష్యత్‌కు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అప్కాబ్ జీఎం బివిఎస్.రాజు, శ్రీవిద్య పాల్గొన్నారు.